క్లుప్తంగా

గన్నీబ్యాగుల కొరత.. నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద సొసైటీ పరిధిలో గల చీనూర్, వాడి, గోలిలింగాల గ్రామాలలో సోమవారం గన్నీబ్యాగులు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ధాన్యంసేకరణకు అవసరమైన గన్నీబ్యాగులు సరఫరా కాకపోవడంతో ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం ప్రక్రియను నిలిపివేశారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు సకాలంలో గన్నీ బ్యాగులను సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. కాగా ఈ విషయమై మాల్తుమ్మెద సొసైటీ సీఈవో సందీప్‌ను 'సాక్షి' సంప్రదించగా మండలంలోని చీనూర్, వాడి, గోలిలింగాల గ్రామాలలో గల కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగుల కొరత ఉన్నది వాస్తవమేనని.. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. మంగళవారం గన్నీ బ్యాగులను తెప్పించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలి



భిక్కనూరు: కాచాపూర్ గ్రామంలోని డబుల్ బెడ్ రూంలలో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ఇళ్లు లేని నిరుపేదలు సోమవారం భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. తమకు గతంలో ఈ డబుల్ బెడ్‌రూంలను కేటాయించినప్పటికి తమకు ఇప్పటి వరకు ఆ రూముల్లో ఉండేందుకు అనుమతి ఇవ్వలేదన్నారు. వెంటనే తమకు ఈ డబుల్ బెడ్‌రూముల్లో నివసించేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు కనీస సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు.

సర్వే లెక్కలు తీసి రిజర్వేషన్లు పెంచాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వేలో అందరూ పాల్గొనాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బక్క గణేష్ అన్నారు. తాడ్వాయిలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సర్వే అనంతరం బీసీ, ఎస్సీ, ఎస్టీల లెక్కలు తీసి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గణేష్‌తో పాటు ప్రధాన కార్యదర్శి గైని రాజలింగం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ముద్ద నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం



ఎల్లారెడ్డి: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ నిర్వహించారు. బ్యాంకు ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా కేక్ కట్ చేశారు. బ్యాంకు ద్వారా రైతులకు, ఖాతాదారులకు మంచి సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. బ్యాంకు మేనేజర్ పవన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా తదితరులున్నారు.

మనిషి తలుచుకుంటే ఏదైనా సాధించొచ్చు



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ జీవితంలో కష్టాలను సవాళ్లను అధిగమించి ధైర్యంగా ముందుకు వెళితే విజేతలుగా నిలిచి నలుగురికి ఆదర్శంగా నిలుస్తారని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ రమేష్ చైతన్య అన్నారు. సోమవారం ఆయన జంగంపల్లి గ్రామంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ విద్యార్థినులనుద్దేశించి అవగాహన కల్పించారు. సమస్యలు అనేటివి ప్రతి ఒక్కరికి ఉంటాయని, వాటిని మనం ఎలా స్వీకరిస్తాం అనే దాని పైన మన విజయం ఆధారపడి ఉంటుందన్నారు. భయపడి ఆత్మహత్యలకు పాల్పడితే ఇటు కన్నవారికి అటు సమాజానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. దివ్యాంగులు చాలా మంది పలు రంగాల్లో విజయం సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ విమల, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

- గెలుపోటములను సమానంగా స్వీకరించాలి
- వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి
- బోర్లం క్యాంపు గురుకులంలో మూడో జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



బాల్‌ను సర్వ్ చేసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ రూరల్: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులకు సూచించారు. సోమవారం ఆయన బోర్లం క్యాంపులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో 3వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను సబ్‌కలెక్టర్ డా.కిరణ్మయి, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష తదితరులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఒలింపిక్ క్రీడాజ్యోతిని వెలిగించి, క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులు క్రీడాపోటీల్లో చక్కటి ప్రదర్శన ద్వారా తమలోని ప్రతిభను చాటాలని సూచించారు. క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. 10వ జోనల్ స్పోర్ట్స్‌మీట్‌కు 3వజోన్‌లోని కామారెడ్డి, సిద్దిపేట్ జిల్లాలకు చెందిన సుమారు 1,275 మంది విద్యార్థినులు హాజరవుతున్నట్లు జోనల్ ఆఫీసర్ ప్రత్యూష తెలిపారు. అండర్-14, 17, 19 విభాగాల్లో గేమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడా పోటీలను ఈ నెల 14 వరకు కొనసాగుతాయని, క్రీడాకారుల కోసం మెరుగైన ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ పద్మ కుమారి తెలిపారు. గురుకుల జిల్లా స్థాయి ఆఫీసర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ సునీత, రమాదేవి నాయకులు పీర్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, మంద శ్రీనివాస్, నారాయణరెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులగణన సామాజిక అంతరాలను తొలగిస్తుంది



బోర్లంక్యాంపులో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాన్సువాడ రూరల్:తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతన్న కులగణన సర్వే పూర్తయితే సామాజిక అంతరాలు తొలగిపోతాయని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బోర్లంక్యాంపులో కొనసాగుతున్న సర్వేను పరిశీలించి మాట్లాడారు. కులగణన అనేది ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమని, భవిష్యత్తులో ఇది దేశానికే దిక్సూచి కాబోతుందన్నారు. ఆయన వెంట నాయకులు కమటాల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, మంద శ్రీనివాస్, కొండ శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం చెక్కుల పంపిణీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో ఐదుగురికి, సంగంలో 20 మందికి, మిర్జాపూర్ 40 మంది డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు చెక్కులను వ్యవసాయ సలహాదారు పోచారంశ్రీనివాస్ రెడ్డి అందించారు. బాన్సువాడ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులతో సమావేశమై నియోజకవర్గంలో అందరికి డబుల్ బెడ్రూం బిల్లులు అందేలా చూస్తామని అన్నారు. మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, నేతలు మారుతి, వెంకటి, శ్రీనివాస్, పవన్ ఉన్నారు.

శుభ్రం చేసిన ధాన్యాన్ని తీసుకురావాలి



గిర్నితండాలో వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో నవ్య

నిజాంసాగర్(జుక్కల్): సన్నరకాల వరిధాన్యాన్ని శుభ్ర పర్చిన తర్వాతనే విక్రయాలు జరపాలని మహమ్మద్‌నగర్ మండల వ్యవసాయశాఖ అధికారిణి నవ్య రైతులకు సూచించారు. సోమవారం మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా, దూప్‌సింగ్ తండాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ధాన్యం విక్రయించిన రైతుల వారిగా ధాన్యం బస్తాలకు మార్క్ వేస్తామన్నారు. సన్న రకాలతో పాటు దొడ్డు రకాల ధాన్యం విక్రయించిన రైతులు ధ్రువపత్రాలను కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు అప్పగించాలని ఆమె సూచించారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి సరిచంద్, నేతలు సంతోష్ రాథోడ్, తదితరులున్నారు.

సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమించాలి



కామారెడ్డి టౌన్: పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమించాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్యసమాజ్ మందిరంలో నిర్వహించిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకునే నాయకులు తప్పకుండా క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలన్నారు. పట్టణంలో 30 వేలకు పైగా సభ్యత్వం లక్ష్యం పూర్తి చేయాలన్నారు. 49 వార్డులలో బీజేపీ కౌన్సిలర్లు విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కామారెడ్డి టౌన్: భిక్కనూరు మండలం జంగంపల్లిలో మల్లు స్వరాజ్యం కాలనీలో రెండేళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ కాలనీలో 2008లో ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వడంతో కొందరు ఇళ్లను నిర్మించుకోగా మరి కొందరు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అధికారులు విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరారు. నాయకుల కొత్త నర్సింలు, నర్సవ్వ, శ్యామల, రమణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

నూతన సభ్యులను గ్రామ సంఘంలో చేర్చుకోవాలి



రాజంపేట:నూతన సభ్యులను గ్రామ సంఘ సభ్యులుగా చేర్చుకోవాలని ఏపీఎం సాయిలు సూచించారు.సోమవారం రాజంపేట మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఇన్‌స్రూ బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, చిన్న సంఘాల పనితీరు గురించి సంఘ సభ్యులతో చర్చించారు. గ్రామ సంఘం అధ్యక్షులు లక్ష్మి,సీసీ సాయిలు, వీవోఏ సుజాత, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



దెగ్లూర్‌లో కార్యకర్తలతో కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. సోమవారం దెగ్లూర్ నియోజకవర్గంలోని కొండల్వాడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు మహారాష్ట్రలో అమలు చేయాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, రుణమాఫీ తదితర పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆయన అన్నారు. మహారాష్ట్రలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

ప్రతి రోజూ 20 కుటుంబాలను సర్వే చేయాలి



మొగులాన్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డీఈవో రాజు



పాల్కంపేటలో పరిశీలిస్తున్న డీఆర్‌డీవో చందర్

బాన్సువాడ రూరల్: ఎన్యుమరేటర్లు ప్రతి రోజూ 20 కుటుంబాలను సర్వే చేయాలని బాన్సువాడ మండల ప్రత్యేకాధికారి, కామారెడ్డి డీఈవో రాజు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని, అలసత్వం వహించరాదని ఎన్యూమరేటర్లకు సూచించారు. సర్వే చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలుంటాయన్నారు. సూపర్‌వైజర్ కిషన్, ఎన్యుమరేటర్ మంద ప్రవీణ్ ఉన్నారు.

పాల్కంపేటలో ..

లింగంపేట(ఎల్లారెడ్డి):పాల్కంపేటలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను డీఆర్‌డీవో చందర్ నాయక్ సోమవారం పరిశీలించారు. సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

చైర్‌పర్సన్ ఇంట్లో సర్వే



వివరాలు తెలుపుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ నివాసంలో సోమవారం అధికారులు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టారు. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీవో గిరిధర్ అధికారులు వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. ఏఈ శంకర్, ఆర్‌వో గోపాల్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన



రాజంపేటలో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రాజంపేట:మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సామాజిక శాస్త్రాల విభాగంలోని వివిధ శాఖల సమన్వయంతో సార్వత్రిక సామాజిక వేదికను ఏర్పాటు చేసిందని కో-ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా విశ్వ విద్యాలయం అందరికీ నాణ్యమైన ఉన్నత విద్యను అతి తక్కువ ఖర్చుతో అందిస్తుందని తెలిపారు. ఉన్నత చదువులు అందుబాటులో లేని, చదువుకునే అవకాశాలు దొరకని లక్షలాది మందికి వయసు, ప్రాంతం, నేపథ్యాలతో సంబంధం లేకుండా నేర్చుకునే అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. విశ్వ విద్యాలయం ద్వారా బీఎల్ఐఎస్‌సీ, ఎంఎల్ఐఎస్‌సీ కోర్సులు చదివిన ఎంతో మంది అభ్యర్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల, కళాశాల గ్రంథాపాలకులుగా ఎంపికైనట్లు తెలిపారు. అధ్యాపకులు శ్రీనివాస్, రాజాగౌడ్, యాదగిరి, పడాల లక్ష్మణ్, రజనీ కాంత్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆస్పత్రుల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినప్పుడు సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించి మంటలను ఆర్పివేయాలని ఎల్లారెడ్డి స్టేషన్ అగ్నిమాపక శాఖాధికారి కిష్టయ్య సూచించారు. గోపాల్‌పేటలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సోమవారం అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారు వివరించారు. అనంతరం ఆస్పత్రి భవనాల కొలతలు తీసుకున్నారు. లీడింగ్ ఫైర్‌మన్ నరేందర్, డ్రైవర్ ఆపరేటర్ బాలరాజు, ఫైర్‌మెన్‌లు ప్రవీణ్, సంతోష్ తదితరులున్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



శ్రీరాం నారాయణ ఖేడియా డిగ్రీ కళాశాలలో..

బాన్సువాడ రూరల్/లింగంపేట/కామారెడ్డి అర్బన్/తాడ్వాయి:స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యా శాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం జిల్లాలో పలు చోట్ల జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ విభజనను వ్యతిరేకించి, అఖండ భారతదేశంగా ఉండాలని కోరిన వ్యక్తి ఆజాద్ అని వక్తలు కొనియాడారు. తన ప్రసంగాలు, రచనల ద్వారా ముస్లింలతో పాటు ప్రతి భారతీయుడిని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేలా ప్రేరేపించారని గుర్తు చేశారు. విద్యా రంగానికి ఆయన విశేషంగా కృషి చేశారని అన్నారు.



కామారెడ్డి అర్బన్ మైనారిటీ గురుకుల పాఠశాలలో..



తాడ్వాయి జూనియర్ కళాశాలలో..

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నేతలు

కామారెడ్డి టౌన్: కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ఉపాధి మెరుగుపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈత, తాటి చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, కల్లు, నీరా విక్రయానికి మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ప్రతీ గీత కార్మికుడికి మోటార్ సైకిల్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని, బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శేఖర్ గౌడ్, బాలాగౌడ్, గంగాధర్, నర్సాగౌడ్, బాల్‌రాజ్, అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరాలయంలో దీపారాధన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కార్తీకమాసం పురస్కరించుకొని తాండూర్ త్రిలింగేశ్వరాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఆలయానికి వచ్చిన మహిళలు ప్రత్యేకపూజలు చేసి దీపారాధన చేశారు.

కళకళలాడుతున్న శివాలయాలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కార్తీక మాసం నేపథ్యంలో శివాలయాలన్నీ కళకళలాడుతున్నాయి. మండల కేంద్రంలోని పాప హరేశ్వర ఆలయంలో కార్తీక సోమవారం తెల్లవారుజమున మహిళలు కార్తీక దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు చేశారు.

నిజాంసాగర్ (జుక్కల్): కార్తీక సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వర ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు సంజీవరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు కార్తీకదీపాలను వెలిగించారు.



ఆధ్యాత్మికం

విఠలేశ్వరుడి ఆలయంలో..



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని విఠలేశ్వరుడి ఆలయంలో భక్తులు సోమవారం కార్తీక పూజలునిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

శివాలయాల్లో మాజీ ఎమ్మెల్యే పూజలు



నిజాంసాగర్(జుక్కల్): కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకొని మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఉన్న పర్లి వైద్యనాథ్ జ్యోతిర్లింగానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పూజలు నిర్వహించారు. ఆయన వెంట జుక్కల్ బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, గంగాధర్, రవి పటేల్, కపిల్ పటేల్ తదితరులున్నారు.

మార్వాడీ ధర్మశాలలో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం



కామారెడ్డి అర్బన్: కార్తీకమాసం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కామారెడ్డి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సిరిసిల్ల రోడ్డులోని మర్వాడీ ధర్మశాలలో సోమవారం ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం ఏర్పాటు చేశారు. జ్యోతిర్లింగాల ప్రారంభ పూజ కార్యక్రమంలో ఓంశాంతి నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయదీదీ, కౌన్సిలర్ ముప్పారపు అపర్ణ, మాజీ కౌన్సిలర్ ఆనంద్, బీకే సంతోషిణి, జైన్ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన సిద్దరామేశ్వరాలయం



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దరామేశ్వరాలయం కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. వేద బ్రాహ్మణులు సిద్ధగిరిశర్మ, రామగిరిశర్మ, రాజేశ్వరశర్మలు భక్తులతో అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

ఘనంగా కార్తీక ఆకాశదీపోత్సవం



కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ఆకాశ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాద్రిశర్మ, విజయపాండేల ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

15న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఈ నెల 15న సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసం పౌర్ణమి రోజున సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తామని వారు చెప్పారు. వ్రతాల్లో పాల్గొనే దంపతులు ముందుగా పేర్లు నమోదు చేసుకొని రూ. 501 చెల్లించి కార్యాలయంలో రసీదు పొందాలని వారు సూచించారు. దంపతులు పూజకు కావాల్సిన సామగ్రి వెంట తెచ్చుకోవాలని, పూజ అనంతరం దంపతులకు భోజన వసతి కల్పిస్తున్నామన్నారు.